TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

సంపుటి : 01 సంచిక : 226 | మంగళవారం ఏప్రిల్ 22 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

# తెలంగాణ తెచ్చుకున్నదే ఉద్యోగాల కోసం

## గతంలో కొందరి ప్రయోజనాలే నెరవేరాయి

## మధిరలో మెగా జాబ్ మేళా కార్యక్రమం భట్టి

తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నదే ఉద్యోగాల కోసం అని, తెలంగాణ తెచ్చుకున్నాక ఓ కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో నిరుద్యోగులందరికీ పారదర్శకంగా ఉద్యోగాలు ఇస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో పేపర్ లీకేజీలతో సమయం అయిపోయిందని, కాంగ్రెస్ హయాంలో నిరుద్యోగులకు పారదర్శకంగా ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. ఖమ్మం జిల్లా మధిరలో మెగా జాబ్ మేళా కార్యక్రమం జరిగింది. ఒకేరోజు 5 వేల మందికి ఉపాధి దక్కింది. ఉద్యోగాలు పొందిన వారికి డిప్యూటీ సీఎం భట్టి నియామకపత్రాలు అందజేశారు. మెగా జాబ్ మేళా కార్యక్రమంలో డిప్యూటీ సీఎంభట్టి విక్రమార్క మాట్లాడుతూ... 'తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నదే ఉద్యోగాల కోసం. తెలంగాణ తెచ్చుకున్నాక ఓ కుటు-ంబానికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయి.

2లో



## ఆ మాత్రం అవగాహన లేకపోతే ఎలా?: ఆర్డీవోపై మంత్రి పొంగులేటి ఆగ్రహం




నల్గొండ: రెవెన్యూ అధికారుల తీరుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నల్గొండ జిల్లా చందంపేటలో భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు తమ భూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. రైతులు ఫిర్యాదుతో ఆర్డీవో రమాణారెడ్డి, తహసీల్దార్‌లను మంత్రి ప్రశ్నలు అడగగా వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో రెవెన్యూ డివిజన్‌పై ఏమాత్రం అవగాహన లేకుండా ఎలా ఉన్నారని ఆర్డీవోపై పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

2లో

## అంబేడ్కర్ అందరివాడు...

కొందరికే పరిమితం చేయడం తగదు

కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడి



2 లో

## హైదరాబాద్‌లో ఈ-సిగరెట్ల విక్రయం.. ముఠా అరెస్టు



2 లో

## కేపీహెచ్‌బీలో దారుణం

హైదరాబాద్‌లో దారుణం చోటుచేసుకుంది.

కేపీహెచ్‌బీ కాలనీలో భార్య తన భర్తను చంపేసి పూడ్చిపెట్టింది.



2 లో

# పసుపుబోర్డు ఘనత మాదే




- బోర్డు పనులు ఇంకా ప్రారంభించని కేంద్రం
- కాళేశ్వరంతో రాష్ట్రం దివాళా
- ప్రాణహిత చేవెళ్ల చేపట్టివుంటే నిజామాబాద్‌కు నీరందేది
- నిజామాబాద్ రైతు మహోత్సవ సభలో మంత్రిఉత్తమ్
- పామాయిల్ సాగుతో మంచి లాభాలన్న మంత్రి తుమ్మల

పసుపు బోర్డు తెచ్చిన ఘనత తమదేనని, దానికోసం తాను పోరాటం చేశానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బోర్డు ఏర్పాటు చేశారు కానీ ఇంకా పనులు ఎందుకు ప్రారంభించలేదని కేంద్రాన్ని ఆయన ప్రశ్నించారు. గత పదేళ్లలో ప్రాణహిత చేవెళ్లను పట్టించుకోలేదని విమర్శించారు. 22వ ప్యాకేజికి వెంటనే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిజామాబాద్‌లో రైతు సభలో మాట్లాడుతూ ..నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని సూచించారు. కాళేశ్వరంతో కొత్తగా ఆయకట్టు పెరగలేదని అన్నారు.

2లో

# మజ్లిస్ కోసమే పోటీకి బిఆర్ఎస్ దూరం



2 లో

ఏ ప్రాతిపదికన పోటీకి దూరంగా ఉన్నారో చెప్పాలి

మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి విమర్శలు

## తెలంగాణ ఇంటర్ ఫలితాలు .. రిజల్ట్స్ తెలుసుకోండిలా..!



లక్షలాది మంది విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న తెలంగాణ ఇంటర్ పరీక్షల ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది.

2 లో

## సెర్ప్‌లో సాధారణ బదిలీలకు రంగం సిద్ధం



హైదరాబాద్: పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో సాధారణ బదిలీలకు రంగం సిద్ధమైంది. మంత్రి సీతక్క ఆదేశాలతో సెర్ప్‌లో వందశాతం బదిలీలకు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ప్రస్తుతం సెర్ప్‌లో 3,974 మంది ఉద్యోగులు ఉన్నారు. ఈ సంస్థలో సాధారణ బదిలీలు జరిగి పదేళ్లయిన నేపథ్యంలో ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం బదిలీలకు ఆమోదం తెలిపింది. పనుల్లో వేగం పెంచేందుకు బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# సంపాదకీయం

## నారాయణబాబు కవిత్వ ఆల్కెమీ

"కవిత్వం ఒక ఆల్కెమీ, దాని రహస్యం కవికే తెలుసును" అని దేవరకొండ బాల గంగాధర తిలక్ ప్రకటిస్తూ ఓ నలుగురు కవుల పేర్లు ఇచ్చాడు. కానీ కవిత్వాన్ని ఆల్కెమీ (రసచర్య) చేయగల తెలుగుకవి శ్రీరంగం నారాయణబాబు మాత్రమే! తన కాలం నాటి భావకవులు రాత్రి ఆకాశాన్ని పూలతోటగాను, నక్షత్రాలను పూలుగాను వర్ణన చేశారు. నారాయణబాబు "నల్లని త్రాచుకోరలు/ తెల్లని మశూచి కుండలు/ గగనమ్మున చుక్కలు" అని రాయగలిగాడు. తానూ, శ్రీశ్రీ తొలినాళ్లలో భావకవిత్వాన్ని రాశామని, అనంతర కాలంలో దానిని తామే విసిరికొట్టామని నారాయణబాబు అన్నాడు. పురిపండా అన్నట్లు "తొలిదినాల్లో నారాయణబాబు అచ్చమైన భావకవి. కట్టుబడిలో, జుత్తులో, వేషంలో కూడా!"

కవిత్వంపై నారాయణబాబు తన అభిప్రాయాన్ని ఇలా ప్రకటించాడు: "కవిత్వమంటే అతి మృదులమైనదీ, బహుసరళమైనదీ, మందుగుండులాంటిదీ. జాగ్రత్త! ఖబడ్దార్! సాంద్రతరమైన నిబిడమైన భాషావిపిన విటపీ వీథుల గంభీరత కాదుబీ గుబురులు గుబురులుగా గుమిగూడిన పాదపశ్యామల పత్రాళిలో అలముకొంటున్న నీరవ నీరంధ్ర భయదాంధకార జీమూతాళి!"

1930–%50 సంవత్సరాల నడుమ నారాయణబాబు రాసిన నలభై కవితల్ని ఆరుద్ర 1972లో 'రుధిరజ్యోతి' కవితా సంపుటిగా ముద్రించాడు. 47 ఏళ్ళ తరువాత 2019లో ఈ పుస్తకాన్ని విజయనగరం నుండి ఎన్. కె. బాబు పునర్ముద్రించాడు.

'కపాలమోక్షం' కవితలో శివుని తపస్సును ఉగ్రంగా, స్వభావసిద్ధంగా వర్ణిస్తాడు నారాయణబాబు. మునులూ, ప్రాణులూ శివుడిని తపస్సు వీడమని ప్రార్థిస్తారు. కళ్ళు తెరిచేసరికి చేతి లోని బ్రహ్మకపాలం నశించిపోతుంది. భిక్షాపాత్రగా కపాలం కావాలని "పటపట పళ్ళు కొరికినాడు" శివుడు. "తురకల గోరీలందున/ క్రైస్తవుల సమాధులందున/ హిందూ శ్మశానవాటుల/ కపాలములు వికవిక నవ్వినవి" అంటాడు. ఔను! మతం మానవులకే గాని, కపాలాలకు లేదు కదా! అదే సమయంలో భగత్ సింగ్‌ను ఉరితీస్తారు. "భారతవీరుని/ కపాల మొక్కటి/ కపర్ది చేతిని/ రివ్వున వాలింది" అని రాస్తాడు నారాయణబాబు, భగత్ సింగ్ పేరు చెప్పకుండానే! శివుని కంటి మంటకు చేతిలోని బ్రహ్మకపాలం నశిస్తే దాని స్థానంలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ పుర్రె చేరిందట. దేశభక్తుని పుర్రె బ్రహ్మకపాలం కంటే గొప్పదని ధ్వనిస్తోంది కదూ! పౌరాణిక ఇతివృత్తాన్ని నేరుగా తీసుకొని, ఆధునిక సంఘటనకు ముడిపెట్టి గొప్ప ఫలితాన్ని సాధిస్తాడు. ఈ కవిత చదివిన రోణంకి అప్పలస్వామి "నారాయణబాబు కవనం మన్ను నుంచి మానవులను సృష్టిస్తుంది," అన్నాడు. "వెయ్యేళ్ళ తెలుగు కవితా భవనానికి నారాయణబాబు ఈ 'కపాలమోక్షం' ద్వారా ఒక ఆధునిక కవితా గవాక్షాన్ని ఆవిష్కరించాడు" అని విశ్లేషిస్తాడు సోమసుందర్.

'ఊరవతల' కవితలోని ఈ పంక్తులను చూడండి: "పోయిన ఆ యేటి నవ్వో/ పుక్కిట నెమరేసుకుంటు/ గండశిల నీడ లోన/ కనుమోడ్చెను/ గార్దభస్వామి" %–% ఇక్కడ కవి ఎండిన సెలయేరును వర్ణిస్తున్నాడు. కెరటాల పొంగును ఏటి నవ్వుగా ఉత్ప్రేక్షించాడు. ప్రస్తుతం ఏరు ఎండిపోయింది. ఆ పొంగును గాడిద తన నోటి నురుగుగా నది గతకాలపు ఉచ్ఛ స్థితిని నెమరు వేసుకుంటుందట. "బ్రహ్మజెముడు కంచె మధ్య/ పూర్ణిమ సంధ్యల్లోన/ గడియైనా ఉదయాద్రిని/ రుధిరజ్యోతై వెలిగే జాబిల్లి/ మృతశరీర ఆక్రమణ/ ఘటాకాశ అరుణారుణ/ రక్తసిక్త మోముతోడ.. గాజుకళ్ళ పురిటి పిల్ల!" తల్లిచే పారేయబడ్డ రక్తసిక్త పురిటిపిల్లను రుధిరజ్యోతై వెలిగే జాబిల్లిగా ఊహ చేయడం నారాయణబాబుకే తెలిసిన విద్య.

"శ్రీశ్రీ కవిత ఛందస్సుల జలపాత వేగంతో ఉరకలిడి బాహ్యస్వరూపంతో పాఠకుణ్ణి లోగొంటే, నారాయణబాబు కవిత సెలయేటి మార్దవంతో పఠిత హృదయంలో చేరి అనంత భావజాలాన్ని ప్రేరేపుతుంది," అని సోమసుందర్ తీర్పునిస్తాడు.

"రుధిర జ్యోతిర్/ జ్వలనా లలనా/ ప్రియుండ!/ విప్లవ ఋషిని/ విద్రోహ కవిని," అని రాస్తాడు నారాయణబాబు. రుధిరజ్యోతిర్జ్వలనాన్ని లలనతోను, ఋషిని విప్లవంతోనూ సంపర్కం చేయించి, కొత్తదైన రసాయన చర్యను కలిగిస్తాడు. పాఠకుల మనసుల్లో భావాన్ని గింగిర్లు కొట్టిస్తాడు. 'విద్రోహం' అనే పదం నజ్రుల్ ఇస్లాం ప్రభావంలో నారాయణబాబు రాశాడు. 1930ల్లో బంగ్లా మహాకవి నజ్రుల్ ఇస్లాం, హరీంద్రనాథ ఛటోపాధ్యాయల ప్రభావం దేశమంతటా ప్రసరించింది.

"భారతీయ సంప్రదాయం ఇతని కవితలో చక్కగా జాలు వారుతూ ఉంటుందిబీ అధివాస్తవికత ఉందంటారే గాని నారాయణబాబు సర్రియలిస్టు కాదు. చివరికి 'మౌన శంఖం' అనే ఒక్క సర్రియలిస్టు కవిత రాశాడు. అంతే!" అని రోణంకి అప్పలస్వామి చెప్పిన మాటలు అక్షరసత్యాలు.

ప్రాచీన సాహిత్యంలో శ్రీకృష్ణదేవరాయల వారి 'ఆముక్తమాల్యద' కావ్యం ఎలాంటిదో, ఆధునిక సాహిత్యంలో నారాయణ బాబు 'రుధిరజ్యోతి' అలాంటిది. "పలికితుత్ప్రేక్షోపమలు" అని కంఠోక్తిగా చెప్పుకున్న రాయలవారు ఉత్ప్రేక్షాలంకారాన్ని చాలాచోట్ల తన కావ్యంలో వాడుకున్నారు. నారాయణబాబు కూడ 'రుధిరజ్యోతి'లోని కవితల్ని గొప్ప ఊహాశాలిత్వంతో రాశారు. 'ఆముక్తమాల్యద' ఆసాంతం రసవంతంగా ఉంటుంది. మనుచరిత్ర వరూధినీ ప్రవరుల ఘట్టం తరువాత చప్పగా ఉంటుంది. శ్రీశ్రీ కవిత్వం పెద్దన మనుచరిత్ర లాంటిది. మహాప్రస్థానం, ప్రాసక్రీడలు వదిలేస్తే ఇతర

## తెలంగాణ తెచ్చుకున్నదే ఉద్యోగాల కోసం

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రజా పాలనలో నిరుద్యోగులందరికీ పారదర్శకంగా ఉద్యోగాలు ఇస్తున్నాం. బీఆర్ఎస్ హయాంలో పేపర్ లీకేజీలతో సమయం అయిపోయింది. కాంగ్రెస్ హయాంలో నిరుద్యోగులకు పారదర్శకంగా ఉద్యోగాలు కల్పిస్తున్నాం. గత పది సంవత్సరాల్లో నిరుద్యోగులు, ఉద్యోగులు ఫలితాలు సాధించలేకపోయారు. ప్రజా ప్రభుత్వంలో మూడంచల్లో ఉద్యోగాల కల్పిస్తున్నాం. ఒకటి ప్రభుత్వ ఉద్యోగాలు, రెండు బహుళ జాతి సంస్థలకు వనరులు ఏర్పాటు చేసి రాష్ట్ర యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు, మూడు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు- రాజీవ్ యువ వికాసం, జాబ్ మేళాలు. 5,000 మందికి యువతకు ఉపాధి కల్పించేందుకు హైదరాబాదులో మరో నాలెడ్జ్ సిటీ- ఏర్పాటు- చేస్తున్నాం. మధిర జాబ్ మేళా ద్వారా 5,000 మందికి ఒకేరోజు ఉపాధి లభించింది. రాష్ట్ర వనరులు, రాష్ట్ర భవిష్యత్తుకు, జీడీపీ పెరుగుదలకు, కుటు-ంబానికి, సమాజానికి పెద్ద ఎత్తున యువత ఉపయోగపడాలి. ప్రతి ఆలోచన మంచిది అయితే మంచి ఫలితాలు సాధిస్తారు. యువత మత్తు పదార్థాలు, సంఘ విద్రోహశక్తులకు దూరంగా ఉండాలి. చివరి దశలో తల్లిదండ్రులు బాధపడకుండా యువత చూసుకోవాలని అన్నారు.

# పసుపుబోర్డు ఘనత మాదే

మొదటిపేజీ తరువాయి

నిజాంసాగర్ ప్రాజెక్టును ఆధునీకరిస్తామని స్పష్టం చేశారు. పూడికతీత పనులకు వచ్చే నెలలో టెండర్లు పిలుస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న ధాన్యం బోనస్ డబ్బులను త్వరలోనే విడుదల చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించి ఉంటే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ఎంతో ఉపయోగం ఉండేదన్నారు. గత ప్రభుత్వం సాగునీటిపై రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసినా..

అదనంగా ఒక్క ఎకరానికీ నీరు ఇవ్వలేదని విమర్శించారు. నిజాంసాగర్, ఎస్సారెస్పీ ప్రాజెక్టులను నిర్మించింది కాంగ్రెస్ హయాంలోనేనని చెప్పారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు మరిన్ని చెక్ డ్యామ్‌లు మంజూరు చేస్తాం. రైతు పక్షపాతిగా ఈ ప్రభుత్వం సాగుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని అన్నారు. రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి రూ.లక్ష కోట్లు అప్పు తెచ్చి కాళేశ్వరం నిర్మించారు. భారాస నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయిందని ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. పసుపు పంటకు మద్దతు ధర వస్తేనే.. పసుపు రైతు తలెత్తుకుని ఉండగలడని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతు సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణకు సాటి వచ్చే రాష్ట్రం మరొకటి లేదన్నారు. రాష్ట్రానికి పసుపుపారాణి లాంటిది నిజామాబాద్ జిల్లా అని పేర్కొన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకు ఒకే విడతలో రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రైతుబంధు ఇచ్చి మిగతా అన్ని పథకాలను నిలిపివేసింది. అకాల వర్షాలకు పంట నష్టపోయిన వారికి త్వరలోనే పరిహారం అందజేస్తాం. భారాస హయాంలో పదేళ్ల పాటు- వ్యవసాయ యంత్ర పరికరాలను ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం మళ్లీ వాటి పంపిణీని పునరుద్ధరించింది. ప్రతి జిల్లాలో ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటు చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఈ సాగు పెరగాల్సి ఉంది. 4 ఎకరాల వరిసాగుతో వచ్చే లాభం ఎకరం ఆయిల్‌పామ్ తోటతో వస్తుందని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అయితే జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేసినందుకు కేంద్ర ప్రభుత్వానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. పసుపు బోర్డు రైతులకు ఉపయుక్తంగా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. తెలంగాణకు పసుపుపారాణి లాంటిది నిజామాబాద్ జిల్లా అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నిజామాబాద్‌లో రైతు మహోత్సవాన్ని ఆయన మరో మంత్రి జూపల్లితో కలిసి ప్రారంభించారు. పసుపు పంటకు మద్దతు వస్తేనే.. పసుపురైతు తలెత్తుకుని ఉండగలడు అని పేర్కొన్నారు. రైతు సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణకు సాటివచ్చే రాష్ట్రం మరొకటి లేదని.. రైతులకు రూ.2 లక్షలు వరకు ఒకే విడతలో రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. కొన్ని కారణాల వల్ల రైతు భరోసా అర్థంతరంగా నిలిచిపోయిందని అన్నారు. మిగిలిన రైతులకు కూడా త్వరలో రైతుభరోసా నిధులు ఖాతాల్లో వేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం రైతుబంధు ఇచ్చిన మిగతా అన్ని పథకాలను నిలిపివేసిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు- వ్యవసాయ మంత్ర పరికరాలను ఇవ్వలేదని.. ఈ ప్రభుత్వం ఇస్తోందని అన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని.. నష్టాలు వస్తున్నప్పటికీ.. అన్ని పంటలను మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వం కొనగోలు చేస్తోందని తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగు చాలా పెరగాల్సి ఉంది... ప్రతి జిల్లాలో ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటు- చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకున్నది పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేయకపోతే రైతులే నష్టపోయే పరిస్థితి వస్తుంది తెలిపారు. 4 ఎకరాల వరి సాగుతో వచ్చే లాభం ఎకరం అయిల్‌పామ్ తోటలో వస్తుందని.. దేవరకొండలో ఒక రైతు కుంకుడుకాయల సాగుతో రూ.6 లక్షలు సంపాదిస్తున్నారని వివరించారు. ఆర్థికపరంగా ప్రభుత్వానికి కష్టాలు ఉన్నా రూ.33 వేల కోట్లు- రైతుల ఖాతాల్లో వేశామని చెప్పారు.

త్వరలోనే రైతు భరోసా ఇస్తామని అన్నారు. వడగండ్ల వానల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం త్వరలోనే అందజేస్తామని మంత్రి తుమ్మల మాటిచ్చారు. రైతు మహోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా సాగు చేయాలని అన్నారు. ఆయిల్ ఫాం పంట వేయండి.. ప్రభుత్వ సహకారం ఉంటుందని

తెలిపారు. 24 గంటల్లో పంట కొని.. వెంటనే డబ్బులు రైతుల ఖాతాల్లో వేయిస్తామని చెప్పారు. అన్నదాతలు ఆదాయం ఉన్న పంటలను పండించాలని సూచించారు. ప్రకృతి, క్రిమికీటకాలు, వ్యాపార వర్గాలు రైతుల మీద దాడి చేస్తున్నా వారిని ఆదుకునేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి జిల్లాలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు- కోసం కృషి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఓటేసినందునే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని...ఇది రైతు ప్రభుత్వమని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మా మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. రైతులను విదేశాలకు తీసుకెళ్లాలని మంత్రులు, అధికారులకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ లక్షల కోట్ల అప్పులు నెత్తిన పెట్టి పోయినా రేవంత్ సర్కార్ ఆరు గ్యారంటీ-లతో పాటు- సన్నబియ్యం పథకం అమలు చేస్తుందని ఉద్ఘాటించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 90 సీట్లకు పైగా గెలుస్తామని ధీమా వ్యక్త చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా మాట నిలబెట్టు-కునేలా పాలన అందిస్తామని చెప్పారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో సీల్టు తీసి సాగునీరు పెరిగేలా చూడాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ఎందుకూ పనికిరాని కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్షల కోట్లు- ఖర్చు చేసి వృథా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని విమర్శలు చేశారు. ఈ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులదని బొమ్మా మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

# కేపీహెచ్‌బీలో దారుణం

మొదటిపేజీ తరువాయి

కేపీహెచ్‌బీ కాలనీ: హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో దారుణం చోటుచేసుకుంది. కట్టుకున్న భర్తను కరెంట్ షాక్‌తో చంపేసి పూడ్చిపెట్టిందో మహిళ. ఆ తర్వాత ఏమీ తెలియనట్లు సొంతూరికి వెళ్లిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా పాతలింగాయపల్లెకు చెందిన సాయిలు, కవిత దంపతులు. వివాహమై దాదాపు 20 ఏళ్లయింది. ఇద్దరు పిల్లలు. కేపీహెచ్‌బీ కాలనీలోని మిత్ర హిల్స్‌లో ఓ గుడిసెలో నివాసం ఉంటున్నారు. కవిత సోదరి జ్యోతి, మరిది మల్లేశం కూడా ఇదే ప్రాంతంలో ఉంటున్నారు. కొంత కాలంగా సాయిలు- కవిత మధ్య గొడవలు జరుగుతున్నాయి.

ఇద్దరికీ తీవ్ర ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు సమాచారం. మరోవైపు భర్త వేధింపులు భరించలేక అడ్డు తొలగించుకోవాలని కవిత పన్నాగం పన్నింది. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో సాయిలు ఇంట్లోనే కవిత, జ్యోతి, మల్లేశం మధ్య గొడవ జరిగింది. ఆ తర్వాత సాయిలు కల్లుతాగి నిద్రించాడు. ఇదే అదునుగా భావించిన కవిత.. కరెంటు షాక్‌తో సాయిలును విలవిల్లాడేలా చేసింది. కొన ఊపిరితో ఉండగా జ్యోతి, కవిత కలిసి అతడికి ఊపిరి ఆడనివ్వకుండా చేసి చంపేశారు. వేకువజాము 5 గంటల వరకు తర్జనభర్జన కొనసాగింది. కవిత, మల్లేశం రూ.3వేలకు ఆటో మాట్లాడి జోగిపేట వైపు మృతదేహాన్ని తీసుకెళ్లారు. వీరి కదిలికలపై అనుమానం వచ్చిన ఆటో డ్రైవర్ గట్టిగా మాట్లాడటంతో తమ ఊరు సమీపంలో ఉందని నమ్మబలికారు.

అయినా, అతడు వినకపోవడంతో.. మృతదేహన్ని శనివారం ఉదయం 11 గంటల సమయంలో తిరిగి మిత్ర హిల్స్‌కి తెచ్చారు. గుడిసెలోనే సాయంత్రం వరకు ఉంచారు. దుర్వాసన వస్తుండటంతో మృతదేహన్ని పడేయడానికి మలేశం చుట్టుపక్కల రెక్కీ నిర్వహించాడు. మిత్రహిల్స్ సమీపంలోనే నిర్మానుష్య ప్రాంతంలో నిర్మాణ వ్యర్థాల కింద పూడ్చి పెట్టారు. అనంతరం మల్లేశం, జ్యోతి వారు ఇంటికి వెళ్లగా కవిత లింగాయపల్లెకు వెళ్లిపోయింది. అప్పటికే సాయిలు ఫోన్ స్విచ్చాఫ్ రావడంతో కుటుంబ సభ్యులకు కవితపై అనుమానం వచ్చింది. మరోవైపు ఆటో డ్రైవర్ ఆదివారం మధ్యాహ్నం కేపీహెబీ పోలీసులకు జరిగిన విషయమంతా చెప్పాడు. దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు ఆదివారం రాత్రి కవితను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఉదయం మిత్రహిల్స్‌లోని గుడిసెను పరిశీలించగా విద్యుత్తు తీగలు తగలబెట్టినట్లు గుర్తించారు. మృతదేహన్ని పడేసిన చోటుకు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. పథకం ప్రకారమే హత్య జరిగినట్లు గుర్తించిన పోలీసులు.. ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# అంబేడ్కర్ అందరివాడు...

మొదటిపేజీ తరువాయి

అంబేద్కర్ అందరివాడని, ఆయనను కేవలం దళితులకు చెందిన నేతగా చూడరాదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ శుభమంగళ గార్డెన్‌లో జయంతి ఉత్సవాల్లో కేంద్రమంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. కొంతమంది ఆ మహనీయుడిని దళితులకే పరిమితం చేస్తున్నారని .. కాని ఆయన భారతదేశ ప్రజలందరికి దేవుడన్నారు. అంబేద్కర్ జీవితాన్ని యువత ఆదర్శంగాతీసుకోవాలని బండి సంజయ్ సూచించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పడినన్ని అవమానాలు ఎవరు ఎదుర్కోలేదన్న కేంద్రమంత్రి వాటినే సోపానాలుగా మార్చుకొని తన చదువును దేశానికి ధారపోసిన గొప్పనేత అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ ను అవమానించిందని.. ఆయనకు భారతరత్న ఇవ్వకుండా... ఎన్నికల్లో ఓడించిందన్నారు. అంబేద్కర్ చనిపోతే ఢిల్లీలో అంత్యక్రియలు చేసేందుకు అభ్యంతరం తెలిపిన కాంగ్రెస్ పార్టీ .. ఆయన పార్థివ దేహాన్ని ముంబయికి పంపి అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ విమాన చార్జీలు వసూలు చేసిందన్నారు. అంబేద్కర్ ఆశయాలను బీజేపీ అమలు చేస్తుంటే కాంగ్రెస్ ఆయన చరిత్రను కనుమరుగు చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. ఒకప్పుడు రిజర్వేషన్లను వ్యతిరేకించిన కాంగ్రెస్ ఓట్లకోసం ముస్లిం రిజర్వేషన్లకు కుట్ర చేసిందని కేంద్రమంత్రి బండిసంజయ్ అన్నారు.

# మజ్లిస్ కోసమే పోటీకి బిఆర్ఎస్ దూరం

మొదటిపేజీ తరువాయి

నగరంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో భారాస ఎందుకు పోటీ చేయడంలేదో ఆ పార్టీ అధినేత కేసీఆర్ చెప్పాలని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అత్యధిక ఓట్లు ఉన్నా ఏ ప్రాతిపదికన పోటీ చేయడం లేదో చెప్పాలన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కెసీఆర్‌కు తమ పార్టీ కార్పొరేటర్లపై నమ్మకం లేదని.. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌కు వెళ్లొద్దని వారికి చెబుతున్నార న్నారు. మజ్లిస్‌తో కాంగ్రెస్ కుమ్మక్కైందని ఆరోపించారు. ఆ మూడు పార్టీల నిజస్వరూపం బయట పెట్టాలనే భాజపా పోటీ- చేస్తోందన్నారు. ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. భారాస, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల కుమ్మక్కు రాజకీయాలను ప్రజలు అర్థం చేసుకున్నారని చెప్పారు. హైదరాబాద్ నగరంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పోటీ- చేయకుండా మజ్లిస్‌కు అండగా నిలబడుతున్నాయని కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికైన కార్పొరేటర్‌లను ఓటు- వేయకుండా బీఆర్ఎస్ బెదిరుస్తుందన్నారు. అత్యధిక ఓట్లు ఉన్నా ఏ ప్రాతిపదికన పోటీ- చేయడం లేదో చెప్పాలన్నారు. పచ్చి మతోన్మాద, రజాకారు మజ్లిస్‌కు సపోర్ట్ చేస్తున్న ఈ రెండు పార్టీలు సెక్యులర్ పార్టీలు ఎలా అవుతాయని ప్రశ్నించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో హైదారాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పరిధిలోని కాకార్పొరేటర్‌లతో కిషన్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పోటీ- చేయకుండా మజ్లిస్‌కు అండగా నిలబడుతున్నాయి. ఎన్ని-కై-న కార్పొరేటర్‌లను ఓటు- వేయకుండా బీఆర్ఎస్ పార్టీ బెదిరుస్తుంది. ఇది తమకు ఓటు- వేసి గెలిపించిన ప్రజలను అవమానించడమే. ఎంఐఎం కోసం ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటు- వేయలేదు. బీజేపీని ఓడించేందుకు ఈ రెండు పార్టీలు పోటీ- చేస్తాయి. పచ్చి మతోన్మాద, రజాకారు మజ్లిస్‌కు సపోర్ట్ చేస్తున్న ఈ రెండు పార్టీలు సెక్యులర్ పార్టీలు ఎలా అవుతాయి. సెక్యులర్ అని రాహుల్ గాంధీ ఏ ముఖం పెట్టు-కుని ప్రచారం చేస్తున్నారు. మజ్లిస్ పార్టీ రజాకర్ పార్టీ అవునా? కదా? రాహుల్ గాంధీ చెప్పాలి.మజ్లిస్ పార్టీ మోచేతి నీళు ఎందుకు తాగుతున్నారు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మజ్లిస్‌కు వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారు. 15 నిమిషాల సమయం ఇస్తే వందకోట్ల హిందువుల సంగతి చూస్తామన్న మజ్లిస్ పార్టీకి ఎందుకు మద్దతు ఇస్తున్నారో చెప్పాలి. బయట ఈ రెండు పార్టీలు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతారు కానీ ఓవైసీ దగ్గర వంగి వంగి సలాంలు కొడతారు' అని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఏ ప్రాతిపదికన కేసీఆర్ పోటీ- చేయడం లేదో చెప్పాలి. ఎవరిని గెలిపించడం కోసం ప్రయత్నం చేస్తున్నారు. కార్పొరేటర్‌లను పిలిచి ఓటు- వేయొద్దని ఎందుకు బెదిరిస్తున్నారు. మీకు చీము నెత్తురు ఉంటే ఎంఐఎంకు బహిరంగంగా ఎందుకు ఓటు- వేయరు. మీ బాస్ (ఒవైసీ)ను బుజగించేందుకు దూరంగా ఉండాలని నిర్ణయం. కాంగ్రెస్ పార్టీ పాత బస్తీలో డిపాజిట్ రాదని తెలిసినా పోటీ- చేసింది.. ఇప్పుడు ఎందుకు పోటీ- చేయడం లేదో చెప్పాలి. మజ్లిస్ పార్టీని తెలంగాణకు ముఖ్యమంత్రిని చేయడానికి ఈ రెండు పార్టీలు పోటీ- పడుతాయి. ఇప్పటికే హైదారాబాద్ నగరంను ఎంఐఎంకు అప్పగించాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో ఈ-సిగరెట్ల విక్రయం.. ముఠా అరెస్టు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఈ–సిగరెట్లు, వేప్స్ విక్రయిస్తున్న ముఠాను టీజీన్యాబ్, పోలీసులు అరెస్టు చేశారు. విద్యా సంస్థల వద్ద విక్రయిస్తుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. చిన్నారులు, యువతే లక్ష్యంగా ఈ ముఠా ఈ–సిగరెట్లను విక్రయిస్తోంది. ఎస్ఐడీ వాట్సప్ గ్రూప్ ద్వారా 500 మందికిపైగా మత్తు పదార్థాలను విక్రయించినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. నిందితులను నాంపల్లికి చెందిన సోదరులుగా గుర్తించారు. వీరికి అమిత్ (దిల్లీ), వసీం (ముంబయి) సరఫరాదారులుగా ఉన్నారు. ముఠా వద్ద రూ.25 లక్షల విలువైన మత్తు పదార్థాలు, 225 అమెరికన్ డాలర్లు, 100 కెనడియన్ డాలర్లు స్వాధీనం చేసుకున్నారు.

# తెలంగాణ ఇంటర్ ఫలితాలు .. రిజల్ట్స్ తెలుసుకోండిలా..!

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో లక్షలాది మంది విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న ఇంటర్ పరీక్షల ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ప్రథమ, ద్వితీయ ఇంటర్ పరీక్షల ఫలితాలను మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతారని తెలిపారు.

విద్యార్థులు తమ ఫలితాలను results.eenadu.net, tgbie.cgg.gov.in వెబ్‌సైట్‌లలో తెలుసుకోవచ్చు. మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు తెలంగాణలో ఇంటర్ పరీక్షలు జరగ్గా.. దాదాపు 9.5లక్షల మందికి పైగా విద్యార్థులు రాశారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్‌ను ఎంటర్ చేసి ఫలితాలు పొందొచ్చు.

# అట్టహాసంగా ప్రారంభమైన రైతు మహోత్సవం

**- ప్రారంభోత్సవం చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**- పాల్గొన్న మంత్రులు ఉత్తమ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 21 :**
రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 21 నుండి 23 వరకు కొనసాగనున్న రైతు మహోత్సవం కార్యక్రమం సోమవారం అట్టహాసంగా ప్రారంభం అయ్యింది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు మహోత్సవాన్ని లాంచనంగా ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి మంత్రితో కలిసి హెలికాప్టర్ లో విచ్చేసిన సహచర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ ఆలీ తదితరులు ఈ మహోత్సవంలో పాల్గొన్నారు. వీరితో పాటు ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు రాజీవ్ గాంధీ హనుమంతు, ఆశిష్ సంగ్వాన్, ఐఏఎస్ అధికారులు భవాని శ్రీ, గోపి, వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులు, కార్పొరేషన్ల చైర్మన్లు భాగస్వాములు అయ్యారు. రైతు మహోత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, అనుబంధ రంగాల స్టాల్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, వ్యవసాయ ఉత్పత్తులు, అధిక దిగుబడులను అందించే అధునాతన వంగడాలు, మేలు జాతి పశువులు, ఆహార పదార్థాల ప్రదర్శనకు దాదాపు సుమారు 150 స్టాళ్లు ఏర్పాటు చేశారు. సేంద్రీయ విధానంలో పంటల సాగు, ఆధునిక పద్ధతుల్లో లాభసాటి వ్యవసాయం, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను అందించే వంగడాలు తదితర వాటి గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, ఆదర్శ రైతుల ద్వారా అన్నదాతలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ఐదు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్టాల్స్ సందర్శించి, నూతన ఆవిష్కరణలు, ఆధునాతన వంగడాలు, వ్యవసాయ, అనుబంధ రంగాల



ఉత్పత్తులను పరిశీలిస్తూ, వాటి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, సేంద్రియ వ్యవసాయం తోపాటు, ఆధునిక సాంకేతికతను జోడించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించే విధంగా వ్యవసాయ మెళుకువలను అందించడానికి రైతు మహోత్సవ కార్యక్రమం ఎంతగానో ఉపకరిస్తుందని, దీనిని రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందరి కోరిక మేరకు నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేసినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. బోర్డును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చి పసుపు రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు, పసుపు ఆధారిత పరిశ్రమలు, ఉత్పత్తులకు కూడా కేంద్రం చొరవ చూపాలని కోరారు. ఈ మేరకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేకంగా కోరుతామని తెలిపారు. ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతుల ప్రయోజనాలే పరమావధిగా పంట రుణాల మాఫీ కింద రైతుల ఖాతాలలో 33 వేల కోట్ల రూపాయలను జమ చేశామని అన్నారు. త్వరలోనే రైతు భరోసా నిధులను కూడా రైతుల ఖాతాలలో జమ చేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతాంగానికి నష్ట పరిహారం సైతం అందించే ఏర్పాట్లు చేస్తామని ప్రకటించారు. దేశంలోనే మరెక్కడా లేనివిధంగా రైతుల నుండి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా పెద్ద ఎత్తున వరి ధాన్యం కొనుగోలు చేస్తూ, సకాలంలో బిల్లుల చెల్లింపులు జరుపుతున్నామని అన్నారు. తెలంగాణాలో ఉన్నది రైతు ప్రభుత్వమని, రైతాంగ సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రకృతి పరంగా, క్రిమికీటకాలు రూపంలో పంటల సాగుకు అనేక అవరోధాలు ఎదురవుతున్నాయని, అయినా కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ రైతు నష్టపోకుండా వారికి అన్ని విధాలా అండగా నిలువాలన్నదే తమ ప్రభుత్వ అభిమతమని వెల్లడించారు. ఇతర దేశాల్లో ఎలాంటి పంటలు పండించి లాభం పొందుతున్నారు, ఆధునిక సాగు, కొత్త పంటల పై రైతులకు మూడు రోజుల ఈ మహోత్సవంలో శాస్త్రవేత్తలు, నిపుణులు అవగాహన కల్పిస్తారని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అత్యంత లాభదాయకమైన పంట



పామాయిల్ అని, దీనిని జంతువులు , చీడ పురుగులు నష్టం చేయవని, అందువల్ల పామాయిల్ పంటను రైతులు సాగు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయించే బాధ్యత తనదేనని భరోసా కల్పించారు. కాగా, వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి తుమ్మల తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ, డ్రిప్ ఇరిగేషన్ లను మళ్ళీ పునరుద్ధరిస్తూ, నిజామాబాద్ జిల్లాకు వీటి మంజూరీలో ప్రాధాన్యత ఇస్తామని అన్నారు.రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రైతులకు ఎంతో ఉపయుక్తంగా నిలిచే ఈ తరహా సదస్సులను ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులలో పూడికతీత పనుల కోసం ఈ నెలాఖరులోగా టెండర్ ప్రక్రియను పూర్తి చేస్తామని, పూడిక తొలగింపు ద్వారా లక్షల ఎకరాల అదనపు ఆయకట్టుకు నీటి వసతి సమకూరుస్తామని ప్రకటించారు. కాళేశ్వరం 20, 21, 22 ప్యాకేజీల పెండింగ్ పనులతో పాటు గుత్ప ఎత్తిపోతల పథకం మిగులు పనుల పూర్తికి అవసరమైన నిధులను కేటాయించి పనులను పూర్తి చేయిస్తామని అన్నారు. భూగర్భ జలాలు వృద్ధి చెందేలా అవసరమైన చోట విరివిగా చెక్ డ్యామ్ లు నిర్మించేలా చూస్తామని అన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగు నీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. గత ప్రభుత్వం నీటిపారుదల రంగానికి లక్షా 81 వేల కోట్ల రూపాయలను వెచ్చించినప్పటికీ, సాగు రంగానికి ఒనగూరిన ప్రయోజనం శూన్యంగా మారిందని ఆక్షేపించారు. అనాలోచిత నిర్ణయాలతో కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టి లక్షా 25 వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధా చేశారని, ఉమ్మడి జిల్లాలో ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీల పనులను కూడా పూర్తి చేయలేకపోయారని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం వచ్చాక, కాళేశ్వరం ప్రాజెక్టు చుక్క నీటిని కూడా వినియోగించకుండానే రాష్ట్రంలో ఇదివరకు ఎన్నడూ లేనివిధంగా దేశంలోనే అత్యధికంగా వరి పంటను పండించి సరికొత్త



రికార్డును సృష్టించామని హర్షం వెలిబుచ్చారు. గత ఖరీఫ్, రబీ సీజన్లను కలుపుకుని 281 లక్షల మెట్రిక్ టన్నుల వరి పంట తెలంగాణాలో ఉత్పత్తి అయ్యిందని, దేశంలోని మరే ఇతర రాష్ట్రాలలో ఇంత పెద్ద ఎత్తున వరి సాగు కాలేదని తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వపరంగా కొనుగోలు చేస్తూ, వారికి పూర్తిస్థాయి మద్దతు ధర అందిస్తున్నామని, సన్నాలు అదనంగా క్వింటాకు రూ. 500 చొప్పున బోనస్ చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. పంట విక్రయించిన రెండు రోజులలోనే రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేస్తున్నామని, కేంద్రాలలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచామన్నారు. ఎక్కడ కూడా గన్నీ బ్యాగుల కొరత లేదని, ఎక్కడైనా గన్నీ బ్యాగులు సమకూర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తామని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన అన్ని ప్రాంతాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నెలకొల్పి, రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా ధాన్యం సేకరణ చేస్తున్నామని తెలిపారు. కాగా, దేశంలోనే మరెక్కడా లేనివిధంగా తెలంగాణలోని 84 శాతం జనాభాగా ఉన్న సామాన్య, పేద కుటుంబాలకు కూడా తమ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తోందని అన్నారు. ఇదివరకు దొడ్డు రకం బియ్యం 2.81 కోట్ల మందికి పంపిణీ చేసేందుకు 10625 కోట్ల రూపాయలను వెచ్చించేవారని, కానీ 70 నుండి 80 శాతం మంది దొడ్డు బియ్యాన్ని భోజనానికి వినియోగించేవారు కాదని అన్నారు. దీంతో రేషన్ బియ్యం రీసైక్లింగ్ వంటి అక్రమ దందాలు జరిగేవని తెలిపారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుండడం వల్ల ఆ తరహా అక్రమాలకూ కళ్లెం పడిందని, రాష్ట్రంలోని 84 శాతం జనాభాగా ఉన్న 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఎంత ఖర్చు అయినా భరిస్తామని, సన్నబియ్యం పంపిణీని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, రైతాంగానికి తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో వెన్నుదన్నుగా నిలుస్తుందని అన్నారు. గత ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్ర ఖజానా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు ఇతర అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను అమలు



చేస్తున్నామని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి రాష్ట్రాన్ని 64 సంవత్సరాల పాటు పాలించిన 21 మంది ముఖ్యమంత్రులు 64 వేల కోట్ల రూపాయల అప్పులు చేస్తే, వాటిపై సంవత్సరానికి 6 వేల కోట్ల రూపాయల వడ్డీ అయ్యేదని అన్నారు. అయితే, గత ప్రభుత్వం కేవలం పది సంవత్సరాల వ్యవధిలోనే రాష్ట్ర అప్పును 8 లక్షల కోట్లకు చేర్చిందని, ఫలితంగా ప్రస్తుతం తమ ప్రభుత్వం ప్రతీ నెల వడ్డీ రూపంలోనే 6 వేల కోట్లు, సంవత్సరానికి 70 వేల కోట్ల రూపాయలు కట్టాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు లక్షా 40 వేల కోట్ల రూపాయలను అప్పులపై వడ్డీల కింద చెలియించాల్సి వచ్చిందని ఆవేదన వెలిబుచ్చారు. అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని అన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, వ్యవసాయ ఆధారిత జిల్లాలో రైతు మహోత్సవం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషం కలిగించిందని, ఆయా జిల్లాల రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ యాంత్రీకరణ, పంట మార్పిడి, ఆధునిక సాగు పద్ధతులు, అధునాతన వంగడాలు, వ్యవసాయ అనుబంధ రంగాలలో అధిక లాభాల సాధనకు పాటించాల్సిన పద్ధతుల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులతో పాటు ఆదర్శ రైతులు అవగాహన కల్పిస్తారని అన్నారు. రైతులు కూడా తమ అనుభవాలను పంచుకోవచ్చని, సాగు రంగానికి సంబంధించి సలహాలు, సూచనలు అందించవచ్చని అన్నారు.

ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీలు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, రాకేష్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు ఈరవత్రి అనిల్, అన్వేష్ రెడ్డి, మానాల మోహన్ రెడ్డి, తాహెర్ బిన్ హందాన్, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, నుడా ఛైర్మన్ కేశ వేణు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులుగా ఎంపిక చేసిన రైతులకు సబ్సిడీతో కూడిన ఆధునిక వ్యవసాయ యంత్ర, పరికరాలు పంపిణీ చేశారు.

## బెజ్జోర గుడిలోని బెజ్జందేవి బసవపురాణం లోని బెజ్జమహాదేవి శిల్పమే ...!

**- కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కంకణాల రాజేశ్వర్, కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ వెల్లడి**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 21 :**
భీంగల్ మండలం లోని బెజ్జోర గ్రామంలో గల అతి ప్రాచీన శైవ దేవాలయం, అత్యంత ప్రాచీన చరిత్ర కలిగిన బెజ్జమహాదేవి ఆలయాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు,రామన్నపేట చరిత్ర గ్రంథ రచయిత కంకణాల రాజేశ్వర్ సోమవారం సందర్శించారు. నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం లోని బెజ్జోర గ్రామం "బెజ్జందేవి" గుడిలోని శిల్పం పాల్కురికి సోమన రాసిన బసవపురాణం,లోని బెజ్జమహాదేవి శిల్పమేనని ప్రముఖ చరిత్ర పరిశోధకుడు,కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ ద్వారా రూఢీ పరిచారు.ఒడిలో శిశువుతో అగుపించే ఈ విగ్రహం శివుణ్ణి పాపడినిచేసి లాలిస్తున్న బెజ్జమహాదేవినే దేవతగా గుడిలో ప్రతిష్టించారు.ఈ సందర్భంగా ప్రముఖ చరిత్రకారుడు కంకణాల రాజేశ్వర్





మాట్లాడుతూ అరుదైన చారిత్రక విగ్రహాలేన్నో ఈ దేవాలయంలో చూడవచ్చని అన్నారు. వీరశైవ భక్తుల శిల్పాలలో అక్కమహాదేవి విగ్రహం ప్రసిద్ధమైందిగా పేర్కొన్నారు. చాళుక్యశైలి గుడిలో కనిపించే మరొక దేవతాశిల్పం చాముండేశ్వరిది. ఇంకొకటి శైవ భక్తునిది.ఈ దేవాలయంలో రెండు శైలుల గణపతులు,ఒక షణ్ముఖుడు,రెండు శైలుల శివలింగాలు,ఒక లింగం వెనక కనిపిస్తున్న లగుడధారి పాశుపతుడు,కాలాముఖ శైవగురువు మున్నగు విగ్రహాల్ని పరిశీలించడం జరిగిందని అన్నారు.గుడికి అనుబంధంగా మెట్లబావి కూడా ఉండేదని అది కాలక్రమేణ కనుమరుగై పోయిందని అన్నారు. సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు,కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ హైదరాబాదు నుండి ఫోన్ లో మాట్లాడారు.బెజ్జోర లోని బెజ్జమహాదేవి ఆలయాల్లోని శిల్పాలు,విగ్రహాల ఛాయాచిత్రాలను చారిత్రిక దృష్టితో పరిశీలించి,పరిశోధించి అనేక చారిత్రిక విషయాల్ని వెలుగులోకి తెచ్చారు.ఈ సందర్భంగా శ్రీరామోజు హరగోపాల్ కంకణాల రాజేశ్వర్ తో ఫోన్ లో మాట్లాడుతూ 10వ శతాబ్దానికి చెందిన గణపతి,మరొక గణపతి 12వ శతాబ్దానికి చెందినది. 10,11వ శతాబ్దాలకు చెందిన చాళుక్య శైలిలో గల గుండ్రని పానవట్టం,ఫంసానా విమానంతో కూడిన ఆలయాల నిర్మాణశైలి 16వ శతాబ్దికి చెందిన శికాంజనేయుడు,శైవ సంప్రదాయానికి చెందిన రెండు జతల పాదాలు,16వ శతాబ్దానికి చెందిన వీరగల్లు విగ్రహం,అక్షరాలు చెరిగిపోయిన శాసన స్తంభం,శైవ సాధువుల ప్రతిష్ట లింగాలు,15వ శతాబ్దికి చెందిన షణ్ముఖుని విగ్రహం పూజలందుకోవడం విశేషంగా పేర్కొనవచ్చని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హర గోపాల్ విగ్రహాలన్నింటిని చూసి పలు ఆసక్తికర విషయాల్ని విషదీకరించారు.బెజ్జం దేవి ఆలయంలో 13వ శతాబ్దానికి చెందిన బెజ్జమహాదేవి విగ్రహం ఇక్కడ నెలకొని ఉండడం చాలా అరుదైన శిల్పాన్ని గుర్తించామని అన్నారు. ఇట్లాంటి విగ్రహాలు దేశంలో,రాష్ట్రంలో చాలా అరుదుగా కనిపిస్తాయని వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు.

## గ్రీవెన్స్ డే బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు

**- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**జగిత్యాల (మన వెలుగు) ఏప్రిల్ 21 :**
జిల్లాలో ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 13 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భం గా సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి, సమస్యల పూర్తి





వివరాలను సమర్పించాలని, ప్రతి కేసుపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు.బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు .బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం

## రైతు లేనిదే రాజ్యం లేదు...అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 21 :**
గిరిరాజ్ కళాశాల మైదానంలో నిర్వహించిన తెలంగాణ రైతు మహోత్సవంలో ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు,ఉత్తమ్ కుమార్,తుమ్మల నాగేశ్వరరావు తో ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్బంగా రైతులకు కావాల్సిన పరికరాలు,ఉత్పత్తులు,సీడ్, ఫర్టిలైజర్ స్టాల్స్,వ్యవసాయ,ఉద్యానవన శాఖలతోపాటు సెరికల్చర్,ఆయిల్ ఫెడ్ ,అనుబంధ శాఖల స్టాల్స్ పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడుతు రైతులకు నూతన సాంకేతిక విధానాలతో , సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రైతు మహోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. రైతు లేనిదే దేశం లేదని అలాంటి రైతన్నల పట్ల చిన్నచూపు చూడొద్దని అన్నారు. అకాల వర్షల కారణంగా పంట నష్టపోయిన రైతులకు కేంద్రం పసల్ బీమా యోజన కింద ఇస్తున్న నష్టపరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయాలనీ సూచించారు. రైతులు పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయాలనీ అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న 500 బోనస్ అన్ని పంటలకు వర్తింప చేయాలని సూచించారు. రైతులకు పెట్టుబడి సహాయం కింద ఎకరానికి 12 వేలు సకాలంలో అందించే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు .

# రైతులు అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి

**- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 21 :**
జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాల ఆవరణలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రైతు మహోత్సవంలో వివిధ అంశాలపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. తొలిరోజైన సోమవారం పసుపు సాగులో మెళకువలు, ఆదర్శ రైతుల అనుభవాలు, చెరకు సాగులో అవరోధాలను ఎలా అధిగమించాలి, ఆయిల్ పామ్ సాగుతో సమకూరే ప్రయోజనాలు, వరి పంటలో మేలు రకాలు, నిర్ణీత సమయంలో పంట విత్తుకోకపోతే కలిగే నష్టాలు, మొక్కజొన్న పంట సాగులో పాటించాల్సిన జాగ్రత్తలు, సుగంధ ద్రవ్యాల సాగు, వాటి ఆధారిత ఉత్పత్తులు, మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలు, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు అవగాహన కల్పించగా, ఆదర్శ రైతులు తమ అనుభవాలను వివరిస్తూ రైతులలో ఆసక్తిని పెంపొందింపజేశారని తెలిపారు.

**22న మంగళవారం నిర్వహించే అవగాహన కార్యక్రమాల వివరాలు : -**
రైతు మహోత్సవంలో భాగంగా ఈ నెల 22న ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, ఆయా అంశాలపై రైతులకు అవగాహన



కల్పించనున్నారని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ ఉదయం 10 గంటల నుండి 10:30 వరకు నాణ్యమైన పసుపు పంట సాగు పద్ధతులపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంకు చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.మనోహర్ రావు రైతులకు అవగాహన కల్పిస్తారని, 10:30 నుండి 10:45 గంటల వరకు మామిడి, ఇతర పండ్ల తోటల పెంపకం పై సంగారెడ్డి ఫల పరిశోధన కేంద్రం సైంటిస్ట్ డాక్టర్ పి.హరికాంత్ అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఉదయం 10:45 నుండి 11:15 గంటల వరకు ఆయిల్ పామ్ సాగుపై శాస్త్రవేత్త నర్సింహారావు, 11:15 నుండి 11:30 గంటల వరకు ఆదర్శ రైతు సుభాష్ తన అనుభవాలను వెల్లడిస్తారని, 11:30 నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు సేంద్రీయ పంటల సాగుపై మంచిర్యాల కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.శివకుమార్, 12:00 నుండి 12:15 వరకు ఆదర్శ రైతు సోమరాజారెడ్డి స్వీయ అనుభవాలను వివరిస్తారని, 12:15 నుండి 12:45 వరకు సోయాబీన్, పత్తి పంటల సాగులో మెళకువల గురించి ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్



డాక్టర్ వై.ప్రవీణ్, 12:45 నుండి 1:00 వరకు ఆదర్శ రైతు ఆలేటి బాలకిషన్ తన అనుభవాలను తెలియజేస్తారని అన్నారు. భోజనానంతరం మధ్యాహ్నం 2:00 నుండి 2:30 గంటల వరకు పశువుల మేత, నిర్వహణ అంశాలపై డాక్టర్ నితీష్ వర్మ, 2:30 నుండి 2:45 వరకు ఆదర్శ రైతు ఎన్.గంగారాం కూరగాయల సాగుపై తన అనుభవాలను పంచుకుంటారని, 2:45 నుండి 3:15 వరకు డెయిరీ నిర్వహణపై ఆకుల పాపయ్య, 3:15 నుండి 3:30 వరకు ఆయిల్ పామ్, పసుపు సాగుపై డి.గంగారెడ్డి, 3:30 నుండి 4:00 వరకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం గురించి నిజామాబాద్ జిల్లా మత్స్యశాఖ అధికారి డి.ఆంజనేయులు, సాయంత్రం 4:00 నుండి 4:15 వరకు స్పాన్ పెంపకంపై ఆదర్శ రైతు వెలగపూడి గోపాల్, 4:15 నుండి 4:45 వరకు మిర్చి పంట సాగుపై శాస్త్రవేత్త కె.నాగరాజు, 4:45 నుండి 5:00 గంటల వరకు కూరగాయల సాగుపై ఆదర్శ రైతు నాగ పోతరావు అవగాహనా కల్పిస్తారని కలెక్టర్ వివరించారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుక ఆహ్వానం అందజేత



**మెట్ పల్లి (మన వెలుగు) ఏప్రిల్ 21 :**
కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పిలుపు మేరకు ఈ నెల 27వ తేదీన హనుమకొండ జిల్లా, ఎల్కతుర్తిలో జరగబోయే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు రావాల్సిందిగా మెట్ పల్లి గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నధం అవుతున్న యువతను కలిసి ఆహ్వానించిన మెట్ పల్లి పట్టణ బిఆర్ఎస్వి,బిఆర్ఎస్ వై నాయకులు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్ రావు,మాజీ కౌన్సిలర్ కిషోర్,బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి మేడిచెల్మెల నాని,ఆకుల ప్రవీణ్,నోముల శివ,మొరపు తేజ,నరేష్,శ్యామ్, అర్జున్,నిమ్ము తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ కీ చిక్కిన ఆర్ఐ

**- భూ సర్వే కోసం 26 వేలు డిమాండ్..**

**- రెడ్ హ్యాండెండ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు**

**జనగామ (మన వెలుగు) ఏప్రిల్ 21 :**
జనగామ జిల్లాలో ఏసీబీ దాడులు కలకలం సృష్టించాయి. జిల్లాలోని చిల్పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏసీబీ దాడులు చేయగా.. ఆర్ ఐ వినయ్ కుమార్ లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. భూ సర్వే కోసం డబ్బులు డిమాండ్ చేయగా.. బాధితులు సోమవారం రూ.26 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెండ్ గా పట్టుకున్నారు. అనంతరం ఆర్ ఐని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించనున్నట్లు



అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే ఇటీవలే జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ లో సబ్ రిజిస్ట్రార్ ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. తాజాగా చిల్పూర్ మండల కేంద్రంలో ఏసీబీ దాడులు జరగడంతో తీవ్ర చర్చగా మారింది.

# బిహార్‌లో 'ఐఐటీ విలేజ్'.. జేఈఈ మెయిన్‌లో 40 మందికి పైగా ఉత్తీర్ణత

జేఈఈ మెయిన్ ఫలితాలు ఇటీవల వెల్లడైన సంగతి తెలిసిందే. 2,50,236 మంది కనీస కటాఫ్ పర్సంటైల్ స్కోర్ సాధించి.. జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత సాధించారు. ఈ అర్హత సాధించిన వారిలో 40 మందికి పైగా ఒకే గ్రామానికి చెందినవారు కావడం గమనార్హం. బిహార్‌లోని గయ జిల్లాలో 'ఐఐటీ విలేజ్' గా పేరుపొందిన పత్వాటోలీ నుంచి వారంతా ఉత్తీర్ణత సాధించడం దేశం దృష్టిని ఆకర్షించింది. వారిలో 28 మంది వృక్ష సంస్థాన్ కోచింగ్ సెంటర్ నుంచి శిక్షణ పొందినవారే .

పత్వాటోలీ ప్రత్యేకత ఏంటి..?

ఈ గ్రామం 'ఐఐటీ విలేజ్'గా పేరు పొందడానికి అసలు బీజం 1991లోనే పడింది. ఆ ఊరి నుంచి ఆ ఏడాది జితేంద్ర పత్వా ఐఐటీలో సీటు సంపాదించారు. ఆ ఘనత సాధించిన తొలి వ్యక్తి ఆయన. తర్వాత ఆయన కెరీర్ పరంగా ఎదిగి, యూఎస్‌లో నివసిస్తున్నారు. కానీ తన మూలాలను మర్చిపోకుండా మిగతావారు తనలాగే ఎదగాలని, Vriksh We The Change పేరిట ఒక ఎన్జీఓను స్థాపించారు. ఇక అప్పటినుంచి ఆ గ్రామంలోని ప్రతి ఇంట్లో ఐఐటీ పదం వినిపిస్తూనే ఉంది. 20వేల మంది గ్రామస్థులు ఉన్న పత్వాటోలీని గతంలో మాంచెస్టర్ ఆఫ్ బిహార్‌గా పిలిచేవారు. వస్త్ర పరిశ్రమలు, చేనేత పని చేసుకునేవాళ్లు ఎక్కువగా ఉండటంతో ఆ పేరు వచ్చింది. ఇప్పుడది ఇంజినీర్లకు నిలయంగా మారింది. ఇప్పటికీ అక్కడి కుటుంబాలు చేనేత పని మీదే ఆధారపడినప్పటికీ.. వారి పిల్లలు మాత్రం విద్యారంగంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారు.

2013లో ఏర్పాటైన వృక్ష సంస్థాన్.. ఐఐటీల్లో చదవాలనుకునేవారికి ఉచిత కోచింగ్ అందిస్తోంది. గ్రాడ్యుయేట్లు అందించే నిధులతో మెటీరియల్స్ ఇస్తోంది. దిల్లీ, ముంబయిలో నివసించే వారు ఆన్‌లైన్ వేదికగా విద్యార్థులకు కోచింగ్ ఇస్తుంటారు. "చాలా కుటుంబాల్లో తమ పిల్లలను పట్టణాలకు పంపించి చదవించలేని పరిస్థితి ఉంది. అందుకోసమే మేం వృక్ష వేద చెయిన్‌ను ప్రారంభించాం. ఒక లైబ్రరీ మోడల్‌ను ఏర్పాటుచేశాం" అని వృక్ష వేద చెయిన్ ప్రెసిడెంట్ దుబేశ్వర్ ప్రసాద్ మీడియాకు వెల్లడించారు.

పదో తరగతి దాటి చదవడమే కష్టమైన పరిస్థితులున్న ఆ గ్రామంలో బాలికలు ఉన్నత విద్యవైపు వెళ్లడానికి అవకాశాలు పెరిగాయి. ఇప్పుడు అక్కడ విద్యార్థులు నీట్ వైపు మొగ్గుచూపుతున్నారు. ఇక తాజాగా జేఈఈ మెయిన్‌లో ఉత్తీర్ణత సాధించిన వారిలో 28 మంది వృక్ష సంస్థాన్‌లో కోచింగ్ తీసుకున్నారు.

# పౌరసత్వం కేసు.. ఆది శ్రీనివాస్‌కు రూ.25లక్షలు అందజేసిన చెన్నమనేని రమేశ్




హైదరాబాద్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ హైకోర్టులో రూ.25లక్షల డీడీ అందజేశారు. చెన్నమనేని పౌరసత్వంపై గతంలో ఆది శ్రీనివాస్ తెలంగాణ హైకోర్టు లో పిటిషన్ దాఖలు చేశారు. జర్మనీ పౌరసత్వం కలిగి ఉండి తప్పుడు పత్రాలతో ఎన్నికల్లో పోటీ చేశారని.. ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఈ అంశంపై కోర్టులో ఆది శ్రీనివాస్ సుదీర్ఘ కాలం పోరాడారు. పలు దఫాలుగా విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. చెన్నమనేని రమేశ్‌కు జర్మనీ పౌరసత్వం ఉన్నట్లు తేల్చింది. తప్పుదోవ పట్టించినందుకు ఆయనకు జరిమానా విధించింది. పిటిషనర్ ఆది శ్రీనివాస్‌కు రూ.25లక్షలు, న్యాయసేవాధికార సంస్థకు రూ.5లక్షలు ఇవ్వాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పు మేరకు నేడు ఆ డబ్బును డీడీల రూపంలో చెన్నమనేని రమేశ్ అందజేశారు.

# ఛాతీ నొప్పితో ఆస్పత్రిలో చేరిన బెంగాల్ గవర్నర్



పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ ఛాతీ నొప్పితో ఆస్పత్రిలో చేరారు. కోల్‌కతాలోని ఈస్ట్రన్ కమాండ్ ఆసుపత్రిలో ఆయనకు అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. శనివారం రాత్రి ముర్షిదాబాద్‌లో అల్లర్లు జరిగిన ప్రాంతాలకు వెళ్లి తిరిగి వచ్చిన అనంతరం ఆయన ఛాతీలో నొప్పి ఉన్నట్లు చెప్పారని..సోమవారం నొప్పి మరింత తీవ్రంకావడంతో ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన గుండె రక్తనాళాల్లో పూడికలు ఉన్నట్లు గుర్తించామని.. మెరుగైన చికిత్స కోసం అపోలో ఆస్పత్రికి తరలించడానికి చర్యలు తీసుకుంటున్నామని వైద్యులు తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

వక్ఫ్ సవరణ చట్టం అమలుకు వ్యతిరేకంగా జరిగిన అలర్ల ఘటన బాధితులను బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ శనివారం పరామర్శించారు. ముర్షిదాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన సహాయ శిబిరాల్లోని బాధితులను కలిశారు. వారికి ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బాధితుల్లో అభద్రతా భావం నెలకొందని గవర్నర్ అన్నారు. దాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చిస్తానని చెప్పారు. ఈ ప్రాంత ప్రజల సమస్యలను తనకు తెలియజేసేలా తన కార్యాలయం ఫోన్ నంబర్‌ను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

# వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కొమిరెడ్డి కరం



**మెట్ పల్లి (మన వెలుగు) ఏప్రిల్ 21 :**
మల్లాపూర్ మండలం రాఘవపేట గ్రామంలో సోమవారం వరి కొనుగోలు కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న టీపీసీసీ సీనియర్ నాయకులు కొమిరెడ్డి కరంచంద్, పీఏసీ చైర్మన్ నరేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వంతడుపుల నర్సయ్య- పుష్పలత. వారి వెంట పిసిసి నాయకులు కొమిరెడ్డి విజయ్ ఆజాద్, సీనియర్ న్యాయవాది సురభి అశోక్, పార్టీ జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీ బోయిని హనుమాన్లు, జవిడి రాజారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఇంటర్ కాలేజీల దుర్మార్గాలను అరికట్టాలని డిఐఈవోకు వినతి



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) ఏప్రిల్ 21 :**
నిజామాబాద్ జిల్లాలో ప్రైవేట్ ఇంటర్ కాలేజిల దుర్మార్గాలను అరికట్టాలని కోరుతూ టీజీవీపీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కళ్యాణ్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో పదవ తరగతి పరీక్షల ఫలితాలు రాకముందే కొన్ని ప్రైవేట్ ఇంటర్ కాలేజీలు ముందుగానే అడ్మిషన్లు ప్రారంభించి,వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయన్నారు. దీంతో విద్యార్థులు విశ్రాంతి కోల్పోయి,ఒత్తిడితో చదువుపై మనస్సు నిలుపలేని స్థితికి చేరుతున్నారు. అడ్మిషన్ పేరుతో తల్లిదండ్రులపై అధిక మొత్తంలో ఫీజులు వేసి,గవర్నమెంట్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసేమని తదుపరి కాలేజీ మారే అవకాశాన్ని కోల్పోయేలా చేసి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఈ చర్యలు విద్యా రంగాన్ని వ్యాపారంగా మలుచే దురుద్దేశంతో కొనసాగుతున్నాయన్నారు. వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించే కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అడ్వాన్స్ ఫీజులు వసూలు చేసే కళాశాలలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. డి ఐ ఈ ఓ సానుకూలంగా స్పందించి నోటీస్ లు అందించి తలిదండ్రులు మోసపోకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమం లో నిఖిల్, వినయ్, దేవేందర్ తదుతరులు పాల్గొన్నారు.

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY
మంగళవారం ఏప్రిల్ 22 2025



# ఆ పోస్ట్‌ను లైక్ చేసి వార్తల్లో నిలిచిన సమంత

వ్యక్తిగత జీవితంలో ఎదురైన పలు సంఘటనల తర్వాత ఆరోగ్యం, ఆత్మస్థైర్యం, మహిళల సంరక్షణ వంటి విషయాలపై గత కొంతకాలంగా నెటిజన్లకు సందేశాలు ఇస్తున్నారు నటి సమంత . బంధాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో వచ్చే పోస్టులను ఆమె లైక్ లేదా షేర్ చేస్తున్నారు. ఈక్రమంలోనే ఆమె తాజాగా వైవాహిక బంధాలు విచ్ఛిన్నం కావడంపై వచ్చిన ఒక సోషల్‌మీడియా పోస్ట్‌ను లైక్ చేశారు. అనారోగ్యంతో ఉన్న భార్యను వదిలించుకోవడానికే భర్త మొగ్గు చూపుతున్నారనే సర్వే గురించి ఉన్న ఈ పోస్ట్‌ను ఆమె లైక్ చేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

సక్సెస్ వెర్స్ అనే ఇన్‌స్టా ఖాతాలో ఆరోగ్యం, అనుబంధం వంటి విషయాలపై తరచూ ఆసక్తికరమైన పోస్టులు వస్తుంటాయి. ఇందులోభాగంగా వైవాహిక వ్యవస్థ బలహీనం కావడంపై ఇటీవల ఆ ఖాతాలో ఒక పోస్ట్ షేర్ చేశారు. “జీవిత భాగస్వామి తీవ్ర అనారోగ్యానికి గురైతే పురుషుడు ఆమెను వదిలేయడానికి ఇష్టపడుతున్నాడు. అదే మహిళలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నారు. భర్త ఆరోగ్యం బాగోకపోయినా అతడిని విడిచిపెట్టాలనుకోవడం లేదు. తాజా సర్వే ప్రకారం ఇది నిరూపితమైంది. భార్యతో ఎమోషనల్ అటాచ్‌మెంట్ లేకపోవడం వల్లే భర్త ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నాడని సర్వేలో తేలింది” అనేది ఆ పోస్ట్ సారాంశం. దీనిని నటి సమంతతోపాటు సుమారు 60 వేలమందికి పైగా నెటిజన్లు లైక్ చేశారు. ఆమె ఇలాంటి పోస్ట్‌ను లైక్ చేయడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది.సమంతకు వివాహమైన విషయం తెలిసిందే. వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతున్నట్లు 2021లో ప్రకటించారు. అయితే ఎక్కడా విడిపోవడానికి గల కారణాలను చెప్పలేదు. ఆ తర్వాత ఏడాది తాను మయోసైటిస్‌తో ఇబ్బందిపడుతున్నట్లు ప్రకటించారు. మయాసైటిస్ చికిత్స తీసుకుంటూనే వరుస ప్రాజెక్టుల్లో యాక్ట్ చేస్తున్నట్లు తెలిపారు. సమంత ప్రస్తుతం ‘రక్త్ బ్రహ్మాండ్’ కోసం వర్క్ చేస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఇది సిద్ధం అవుతోంది. ఆమె నిర్మాతగా వ్యవహరించిన తొలి ఫీచర్ ఫిల్మ్ ‘శుభం’ మే 9న విడుదల కానుంది.

# షైన్ టామ్ చాకోపై ఎలాంటి లీగల్ యాక్షన్ తీసుకోను: నటి



ఓ సినిమా చిత్రీకరణ సమయంలో పేరు పొందిన ఒక నటుడు తనతో ఇబ్బందికరంగా ప్రవర్తించాడని ఇటీవల ఆరోపణలు చేశారు నటి విన్సీ సోనీ అలోషియస్. ఆ నటుడి పేరు ఆమె ప్రస్తావించనప్పటికీ ఫిల్మ్ ఛాంబర్‌లో ఆమె ఫిర్యాదు చేయడంతో షైన్ టామ్ చాకో గురించే చెబుతుందనే విషయం బహిర్గతమైంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆమె మీడియాతో మాట్లాడారు. ఆ వ్యక్తిపై తాను ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోవాలనుకోవడం లేదన్నారు. సినీ పరిశ్రమలో ఇలాంటి సమస్య తనకు ఎదురైందన్న ఆమె.. పరిశ్రమలోనే దీనికి పరిష్కారం దొరకాలని తెలిపారు. పరిశ్రమలోనే తాను పోరాటం చేస్తానని చెప్పారు. సెట్స్‌లో మహిళలకు ఎన్నో సమస్యలు ఎదురవుతున్నా సినీ పెద్దలు పట్టించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నటుడిపై తాను ఫిర్యాదు చేసినప్పటికీ పరిశ్రమలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. ఛాంబర్‌లో తాను ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకోనని వెల్లడించారు.సెట్‌లో తనకు ఎదురైన సంఘటన గురించి తెలియజేస్తూ కొన్ని రోజుల క్రితం విన్సీ సోనీ అలోషియస్ మీడియా ముందుకువచ్చారు “సినిమా షూటింగ్ సమయంలో ఆ హీరో డ్రగ్స్ తీసుకున్నాడు. నాతో అనుచితంగా ప్రవర్తించాడు. ఆ షూటింగ్ జరిగినన్ని రోజులు ఎంతో ఇబ్బందిపడ్డా. తన ముందే దుస్తులు మార్చుకోమని ఇబ్బందిపెట్టాడు. దీని తర్వాత ఇక డ్రగ్స్ అలవాటు ఉన్న నటులతో నటించకూడదని నిర్ణయించుకున్నాను” అని విన్సీ తెలిపారు. అనంతరం ఆమె ఈ ఘటనపై కేరళ ఫిల్మ్ ఛాంబర్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు విషయం బయటకు రావడంతో ఆ నటుడు షైన్ టామ్ చాకో అనే విషయం తెలిసిందే. దీనిపై ఆమె స్పందిస్తూ.. అతడి పేరు ఎక్కడా బయటకు రాకూడదని ఫిర్యాదు చేసినప్పుడే అధికారులకు చెప్పానని తెలిపారు. ఆ అధికారులు తనకు నమ్మక ద్రోహం చేశారన్నారు. మరోవైపు, షైన్‌ను ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. డ్రగ్స్ వినియోగిస్తున్నారనే ఆరోపణలతో శనివారం ఆయన్ని అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన బెయిల్‌పై బయటకు వచ్చారు.


# కర్ణాటకలో ప్రత్యక్షమైన ఎన్టీఆర్

## ప్రశాంత్ నీల్ సినిమా కోసం వచ్చినట్లు సమాచారం


యంగ్ టైగర్ ఎన్టీఆర్ సినిమాల కోసం అభిమానులు ఎంత ఆసక్తిగా ఎదురు చూస్తుంటారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆర్ఆర్ఆర్ సినిమాతో పాన్ ఇండియా స్టార్ హీరోగా పేరు ప్రఖ్యాతలు అందిపుచ్చుకున్న ఎన్టీఆర్ ఆ తర్వాత వచ్చిన దేవర చిత్రంతో ఫుల్ క్రేజ్ సంపాదించుకున్నాడు. దేవర తర్వాత ఎన్టీఆర్ ఏ హీరోతో సినిమా చేయనున్నాడు, షూటింగ్ ఎప్పుడు మొదలు పెడతాడు, ఎప్పుడు పూర్తి చేస్తాడు అనే అనుమానాలు అందరిలో ఉన్నాయి. ఇప్పుడు అభిమానుల ఆనందాన్ని రెట్టింపు చేసేందుకు యంగ్ -టైగర్ ఏప్రిల్ 22 నుంచి కర్ణాటకలో జరగనున్న షూటింగ్ లో పాల్గొననున్నాడు. ఎన్టీఆర్ హైదరాబాద్ ను వదిలి కర్ణాటకకు వెళ్లాడు. ర్ణాటక వెళ్తూ ఎయిర్‌పోర్టులో తన నిర్మాతలతో మాట్లాడుతూ కనిపించాడు. ఆ సమయంలో ఎన్టీఆర్‌ని తమ కెమెరాలలో బంధించారు. ఎన్టీఆర్ లుక్ అయితే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎన్నడు లేనంత సన్నగా , స్టైలిష్ గా కనిపిస్తున్నాడు. జాకెట్ లాంటి షర్ట్, కళ్లకు అద్దాలు పెట్టు-కుని తన లుక్‌తో ఆకట్టుకున్నాడు ఎన్టీఆర్. పీరియాడిక్



యాక్షన్ డ్రామాగా ఎన్టీఆర్- ప్రశాంత్ నీల్ చిత్రం తెరకెక్కుతుండగా, ఈ సినిమాలో ఎన్టీఆర్ ను నీల్ చాలా కొత్తగా ప్రెజెంట్ చేయాలని చూస్తున్నట్టు- తెలుస్తోంది. భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ సినిమా ఆడియన్స్ కు నెక్స్ట్ లెవెల్ ఎక్స్‌పీరియెన్స్ ఇస్తుందని చిత్ర యూనిట్ చెప్తోంది. ఇటీ-వల ఈ హై ఓల్టేజ్ యాక్షన్ మూవీ చిత్రీకరణ హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీ-లో మొదలైంది. ఈ క్రేజీ మూవీ సెట్స్‌లోకి ఎన్టీఆర్ ఎప్పుడెప్పుడు అడుగు పెడతాడా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు ఆ సమయం వచ్చేసింది. ఎన్టీఆర్ సెట్స్ లో అడుగుపెట్టబోతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేస్తూ.. మారణహోమానికి ముందు ప్రశాంతత.. అంటూ ఎన్టీఆర్ షూటింగ్ కోసం స్టార్ట్ అయిన వీడియోను షేర్ చేసింది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లలో నవీన్ యెర్నేని, రవిశంకర్, నందమూరి కళ్యాణ్ రామ్ ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బ్లాక్ బస్టర్ హిట్స్‌ను తెరకెక్కించిన ప్రశాంత్ నీల్ యూనిక్ మాస్ విజన్‌తో ఎన్టీఆర్‌ను సరికొత్త మాస్ అవతార్‌లో చూపించబోతున్నారు. ఇది సినీ ఇండస్ట్రీలో సరికొత్త మైలురాయిని సృష్టించనుందని అంటున్నారు.



# రామ్ పోతినేనితో డేటింగ్..? స్పందించిన భాగ్యశ్రీ బోర్సే!



తన అందం, అభినయంతో తొలి సినిమాతోనే అందరికీ అభిమాన నటిగా మారారు భాగ్యశ్రీ బోర్సే . ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో ఆమె పేరు ట్రెండింగ్ అవుతోంది. దీనికి కారణం యంగ్ హీరో రామ్ పోతినేనితో ఆమె డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు ప్రచారం కావడమే.వీరిద్దరూ కలిసి ఓ సినిమాలో లో నటిస్తోన్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కినప్పటి నుంచి వీరిద్దరిపై రూమర్స్ ప్రారంభమయ్యాయి. తాజాగా వీరిద్దరూ షేర్ చేసిన ఫొటోల్లో బ్యాక్‌గ్రౌండ్ ఒకేలా ఉండడంతో ఈ ప్రచారం జోరందుకుంది. ఆ ఫొటోలు చూసిన నెటిజన్‌లు ‘ఒకే గదిలో ఫొటో దిగారా’ అంటూ కామెంట్స్ పెడుతున్నారు. మరొక నెటిజన్ ఇంకాస్త వివరంగా ‘మీ చేతికి ఉంగరం ఉంది. అది ఎవరు తొడిగారు?’ అని అడిగారు. దీనికి భాగ్యశ్రీ స్పందిస్తూ.. ‘అది నేనే కొనుక్కున్నాను’ అని రిప్లై పెట్టారు. ప్రస్తుతం వారి ఫొటోలతో పాటు ఆమె రిప్లై కూడా ఆసక్తిగా మారింది.ప్రస్తుతం వీరిద్దరూ మహేశ్‌బాబు.పి దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. ఇందులో సాగర్‌గా రామ్ కనిపించనుండగా.. మహాలక్ష్మి పాత్రలో భాగ్యశ్రీ అలరించనున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ ఒక షెడ్యూల్ పూర్తి చేసుకుంది. దీనితో పాటు దుల్కర్ సల్మాన్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న ‘కాంత’ లోనూ భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నారు. ఇందులో రానా

# రావణ పాత్ర కోసంయశ్ కసరత్తు



కేజీయఫ్ సినిమాతో పాన్ ఇండియా హీరోగా మారిపోయిన యష్, కాస్త గ్యాప్ తీసుకొని ప్రస్తుతం టాక్సిక్ సినిమాలో నటిస్తున్నాడు. గీతు మోహన్‌దాస్ డైరెక్షన్‌లో ఈ సినిమా తెరకెక్కుతోంది. యశ్ 19వ సినిమాగా వస్తున్న దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇదే సమయంలో యష్ రెండు భాగాలుగా తెరకెక్కబోతున్న హిందీ చిత్రం రామాయణ్‌లో రావణ పాత్ర వేయబోతున్నారు. కేజీఎఫ్’ సిరీస్ సినిమాలతో రాఖీ భాయ్‌గా దేశ వ్యాప్తంగా తిరుగులేని అభిమానులను సంపాదించుకున్నాడు క్రేజీ స్టార్ యష్. ఈ సినిమాలతో కన్నడ ఇండస్ట్రీ వైపు యావత్ భారతం ఆశ్చర్యంతో చూసింది. దీంతో తన తదుపరి ప్రాజెక్ట్ మీద ఎన్నో హోప్స్ పెట్టుకున్నారు ఫ్యాన్స్. అదుకని ఆలోచించి ఫైనల్‌గా లేడీ డైరెక్టర్‌తో ’టాక్సిక్’ మూవీకి శ్రీకారం చుట్టిన యష్ అదే జోష్‌తో మరో మహత్తర సినిమాకు పూనుకున్నారు అదే ’రామాయణ’. నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ రెండు భాగాలుగా రానుంది. ఈ భారీ మూవీని తన స్నేహితుడితో కలిసి యష్ కూడా నిర్మిస్తున్నారు. ఇక రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి సీతారాములుగా నటిస్తుండగా రావణ బ్రహ్మ పాత్రలో యష్ నటిస్తున్నారు. బాబిడియోల్ హనుమంతుడిగా కనిపించనున్న ఈ మూవీ ఫస్ట్ పార్ట్ షూటింగ్ దాదాపుగా చివరి దశకు చేరుకుంది. అయితే తాజాగా ’రామాయణ’ కోసం అన్నగారు ఎన్టీఆర్ సెంటిమెంట్ ఫాలోఅవుతున్నారట యష్. ఇంతకీ ఏంటా సెంటిమెంట్ అంటే.. చాలా వరకు పౌరాణిక సినిమాల్లో నటించే సమయంలో, రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా మన నటులు నియమ నిబంధనలు పాటించేవారట. ఈ విషయంలో అన్నగారు ఎన్టీఆర్ చాలా మందికి ఆదర్శంగా నిలిచారు. ఆయన నటించిన పౌరాణిక సినిమాల సమయంలో పాత్రని బట్టి ఆయన చాలా నిష్టగా ఉండేవారని ప్రచారం. ఆయన సెంటిమెంట్‌ని కొంత మంది ఇప్పటికి పాటిస్తున్నారు. దీంతో తొలి సారి రావణుడి పాత్ర కోసం యష్ కూడా ఆనాటి సెంటిమెంట్‌ని పాటిస్తుండటం విశేషం. నిష్టగా ఉంటూ పాత్రకు న్యాయం చేసేందుకు పాటుపడుతున్నారు.